క్లుప్తంగా

నవోదయలో సీటు సాధించిన విద్యార్థికి అభినందన

- విద్యార్థి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు
- సర్కార్ బడిలోనే తమ కుమారుడిని చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న టీచర్లు



విద్యార్థిని అభినందిస్తున్న మాధవరం యూపీఎస్ ఉపాధ్యాయులు

మునగాల : మండలంలోని మాధవరంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పరెడ్డి అర్జున్‌రెడ్డి నవోదయ పాఠశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు కల్పన, మురళీకృష్ణ, చిన్నారావు, ఉపేంద్రమ్మ, మన్నెమ్మలు అర్జున్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించి అభినందించారు. కాగా అర్జున్‌రెడ్డి తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో మాధవరంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తించిన వారు తమ కుమారుడు అర్జున్‌రెడ్డిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాగన్న

హుజూర్‌నగర్ : సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును లబ్ధిదారుడు వల్లపుదాసు రాజేష్‌కు, రూ.22,500ల చెక్కును చెడపంగు ఏసుపాదంకు మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోడి ఉపేందర్, కె.యోహాన్, వై.వీరబాబు, కె.సైదులు, ముస్తఫా, దిల్, ఉద్దండు, గణేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : తనను నమ్మిన వారి కుటుంబాలకు అండగా ఉంటానని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు అన్నారు. హుజూర్‌నగర్‌లో అనారోగ్యంతో మరణించిన షేక్ రసూల్ కుటుంబానికి రూ.10 వేలు, పులి పద్మ కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను పరామర్శించారు. ఆయనతో పాటు స్థానిక యువకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గరిడేపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వి.నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మంగాపురంలో గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషకాహార కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గత సంవత్సరం డెంగీ జ్వరం కేసులు నమోదు కావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలందరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, సుమిత్ర, ముత్యాలరావు, సరస్వతి, నిర్మల, విజయ, పద్మ, శశికళ, సునిత, నరేష్, పరుశరాం పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

నేరేడుచర్ల : మండలంలోని దాచారంలో నేరేడుచర్ల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మార్కెట్ కార్యదర్శి సన్నీ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మిక సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలి

హుజూర్‌నగర్ : భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలని కార్మిక సంఘం నాయకులు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ టౌన్ హాల్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇతర స్వతంత్ర సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు సంఘం సభ్యత్వం పొందాలని, సంఘం నిర్ణయించిన రేట్లకు మాత్రమే పనిచేయాలని చెప్పారు. జె.ప్రసాద్, వై.సోమయ్య, సైదా, శ్రీనివాసరెడ్డి, రాజు, వినాయకరావు, భాస్కర్, రాంబాబు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి నాగవల్లీ దళాలతో పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా నెమలిపురి రోడ్డు

- మట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలతో రహదారి ధ్వంసం
- ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీరోడ్డు నిర్మించాలని వేడుకోలు



అధ్వానంగా దోరకుంట- నెమలిపురి రోడ్డు

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని దోరకుంట నుంచి నెమలిపురి, కాపుగల్లుకు వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రహదారి గుంతలమయంగా మారి ప్రజలు, రైతులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోరకుంట శివారులో ఉన్న గుట్టల నుంచి మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్లలలో భారీ లోడ్‌తో నెమలిపురి రోడ్డు మార్గంలో వెళ్లడంతోనే పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోరకుంట నుంచి పులిచింతల అవాస గ్రామమైన నెమలిపురి వరకు ఒకటిన్నర కిలో మీటర్లు, అక్కడి నుంచి కాపుగల్లు వరకు గల ఆరు కిలోమీటర్లు బీటీ రోడ్డు ఉంది. ఆయా గ్రామాల శివారులో ఉన్న ప్రభుత్వ గుట్టల నుంచి స్థానిక మట్టిమాఫియాతో పాటు ఖమ్మం-కోదాడ రహదారి పనులకు మట్టిని సదరు కాంట్రాక్టర్ టిప్పర్లు, ట్రాక్టర్లలో రాత్రింబవళ్లు తరలించడంతో ధ్వంసమైంది. దీంతో గతంలో పలుమార్లు మట్టి ట్రాక్టర్లు, టిప్పర్లను ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్న సమయంలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చి ఆ తర్వాత చేయకుండానే వెళ్లారని గ్రామస్తులు అంటున్నారు. రోడ్డు ధ్వంసం కావడంతో ఎక్కడ ఏ గుంత ఉందోనని, తేలిన కంకర రాళ్లతో వాహనాలు అదుపుతప్పి ఎక్కడ కిందపడతామోనని భయంతో బండి నడపాల్సి వస్తుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన బీటీ రోడ్డు నిర్మించేందుకు కృషి చేసి తమ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



దోరకుంట నుంచి నెమలిపురికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి నూతన బీటీరోడ్డు నిర్మించి గ్రామస్తులు, వాహనదారుల సమస్యను పరిష్కరించాలి.

– సూర్యనారాయణ, దోరకుంట

ప్రతిపాదనలు పంపాం



దోరకుంట నుంచి నెమలిపురి, అక్కడి నుంచి కాపుగల్లు వరకు గల 7.5 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– జివ్వాజి రాము, పీఆర్ ఏఈ, కోదాడ

పారదర్శకతకే సామాజిక తనిఖీ

- డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష



సమావేశంలో ఉపాధి హామీ పనులపై ఆరా తీస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష, అధికారులు

పాలకవీడు : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పారదర్శకతంగా అమలు చేసేందుకే సామాజిక తనిఖీ నిర్వహించిన ప్రజావేదికలో సమీక్షిస్తున్నట్లు డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష తెలిపారు. పాలకవీడు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై మంగళవారం పాలకవీడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో కొలతలు, వేతనాల చెల్లింపులు, మెటీరియల్ వినియోగం తదితర అంశాల్లో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేదిలేదని అన్నారు. నెల రోజులుగా గ్రామాల్లో రీసోర్స్ పర్సన్స్ సామాజిక తనిఖీ చేసినట్లు తెలిపారు. 2024- 25 సంవత్సరానికి గాను మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో మొత్తం 458 రకాల పనులు చేయగా ఆయా పనులకు గాను రూ.3,81,27,356 ఖర్చు చేసినట్లు సభకు వివరించారు. గ్రామాల వారీగా చేసిన పనులు, ఖర్చులపై నివేదికలు వినిపించారు. ముఖ్యంగా కొలతల్లో తేడాలు, హాజరు నమోదు, పనుల విలువకు మించిన బిల్లులపై సందేహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి రూ.4లక్షలు రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ లచ్చిరామ్‌నాయక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి శంకర్, ఎస్‌ఆర్‌పీ సురేందర్, ఏపీఎం ఉషారాణి, ఎంపీఓ, ఏపీఓ, ఈసీ, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి

నడిగూడెం : నడిగూడెంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం తనూషా మహాలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సూర్యాపేటలో ఆయన తనూషా మహాలక్ష్మి మృతదేహాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని విచారణ చేపట్టి ఆత్మహత్యకు గల కారణాలను రాబట్టాలన్నారు. ఆయన వెంట మండల మాల మహానాడు అధ్యక్షుడు కొమ్ము రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు నోసిన లావణ్య, మండల ప్రధాన కార్యదర్శి బూరుగడ్డ థామస్, నాయకులు గాజుల పున్నమ్మ, పసుపులేటి వలుల్లికార్జున్ ఉన్నారు.

విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనా స్థలం పరిశీలన

నడిగూడెం : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం తెల్లవారుజామున పదవ తరగతి విద్యార్థి తనూషా మహాలక్ష్మి (14) ఆత్మహత్య చేసుకుంది. ఘటనా స్థలాన్ని బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండారు కవితారెడ్డి పరిశీలించారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీజేపీ కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, సీనియర్ నాయకురాలు నూనె సులోచన, ఓరుగంటి పురుషోత్తం, బండారు వీరబాబు, వెంకటేష్, బాబు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యకు కుటుంబ తగాదాలే కారణమని చెప్పడం తగదు

నడిగూడెం : నడిగూడెం కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో నిమ్మ తనూషా మహాలక్ష్మి ఆత్మహత్యకు కారణాలేంటో నిర్ధారణ కాకముందే జిల్లా విద్యాధికారి కుటుంబ తగాదాలతో ఆత్మహత్యకు పాల్పడిందని మీడియాకు చెప్పడం తగదని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు కామళ్ల ఉదయ్, కార్యదర్శి పులి రాఖీ మంగళవారం అన్నారు. విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం



నేరేడుచర్ల : పూజలో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల శ్రీకోదండ రామాలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామికి మంగళవారం అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆవు పాలు, ఆవు పెరుగు, తేనే, పన్నీరు, పండ్ల రసాలు, గంధం, పంచదారతో స్వామివారికి.. ఆలయ పూజారి బృందావనం తేజ అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రావు, జెట్టి వెంకన్న, దేవేందర్, కాంపెల్లి నారాయణరెడ్డి, కొణతం విజయలక్ష్మి, తాటికొండ పుల్లమ్మ, తడకమళ్ల అరుణ తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్ : బూరుగడ్డ ఆలయంలో పూజలో పాల్గొన్న ఈఓ, ధర్మకర్తలు, భక్తులు

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి మంగళవారం అర్చకులు హరీష్‌కుమారాచార్యులు, పి.శ్రీనివాసచార్యులు.. గంధ సింధూరం, 108 తమల పాకులతో ఆకుపూజ చేశారు. తొలుత పంచామృతాలతో అభిషేకం చేసి పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదన చేశారు. నీరాజన మంత్ర పుష్పం అనంతరం తీర్థప్రసాదాల వినియోగం గావించారు. పూజా కార్యక్రమాలకు గింజల నరేందర్ రెడ్డి, వాసంతి సహకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వై.గురవయ్య, ధర్మకర్తలు అంజయ్య, హరీష్‌కుమార్, నరసింహారావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, కవిత, ఈఓ లక్ష్మణరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

టీఎస్ పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



నామవరం ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

మోతె : మండల పరిధిలోని నామవరంలో గల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం టీఎస్ పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం, ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఊట్కూరు వెంకటరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మడిపల్లి కిరణ్, ఉపాధ్యాయులు కొత్తపల్లి రాంరెడ్డి, గిరి, మామిడి శ్రీను, సోమ సురేష్, ప్రవీణ్, మల్లయ్య, కృష్ణయ్య, మంగత్య, వీరారెడ్డి, రమేష్, మజీదు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య ట్రైనర్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో సీసీరోడ్డు పనులు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి, ఏఈ మౌనిక

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలోని మూడో వార్డులో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో రూ.4 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు చేపట్టినట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి తెలిపారు. సుమారు.30 లక్షల వ్యయంతో స్థానిక చైతన్య కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీ రాజ్ ఏఈ మౌనికతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బంక శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

మునగాల హెడ్ రెగ్యులేటర్ వద్ద మరమ్మతు పనులు



సాగర్ ఎడమకాలువ మునగాల హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటికొలత సిగ్నల్స్ వేస్తున్న సిబ్బంది

మునగాల : నాగార్జునసాగర్ ఎడమకాలువకు త్వరలో నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో మంగళవారం మునగాల మండల కేంద్రం శివారులోని ఎడమకాలువ హెడ్ రెగ్యులేటర్ ప్రధానగేట్ల వద్ద సిబ్బంది ముమ్మరంగా మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సిబ్బంది ప్రధానగేట్లకు గ్రీసింగ్ చేయడం, నీటికొలత సిగ్నల్స్‌ను వేయడంతో పాటు పలు పనులు చేశారు. ఎన్‌ఎస్‌పీ ఏఈఈ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వెంకటనారాయణ, జానీ, ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి.

పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

మునగాల : పేకాట స్థావరంపై మునగాల పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కలకోవలో గల సురభి సతీష్ నివాసంలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న సురభి సతీష్, తొండల వీరబాబు, సురభి వెంకటేశ్వర్లు, బచ్చలకూర సత్యంను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1700 నగదు, ఆరు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సురభి రమేష్, అమరగాని శ్రీను అక్కడి నుంచి పరారయ్యారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలతో సీఎం స్థాయిని దిగజారుస్తుండు

హుజూర్‌నగర్ : రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలతో సీఎం స్థాయిని దిగజారుస్తుండని మాజీ జెడ్పీటీసీ డాక్టర్ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అమరవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరి సభలో సీఎం రేవంత్ రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి గురించి మాట్లాడిన మాటలు ఆయనలో పెరిగిపోతున్న అసహనం, అభద్రత భావానికి నిదర్శనమన్నారు. కళ్ల ముందు కనబడుతున్న వాస్తవాలను ఒప్పుకోలేక, ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను 420 హామీలను అమలు చేయలేక సీఎం రేవంత్ రెడ్డి ప్రతి బహిరంగ సభలో కేసీఆర్, కేటీఆర్ జగదీష్ రెడ్డిల గురించి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వంపై రోత మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అబ్దుల్ నబీ, అంజిరెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వానలు కురవాలని.. పంటలు పండాలని



ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వరుణ పాయసం, జలబిందెలతో భక్తులు

హుజూర్‌నగర్ : సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని హుజూర్‌నగర్ మండలంలోని దొండపాడులో రైతులు, మహిళలు మంగళవారం శ్రీఆంజనేయస్వామి పాదాలపై వరుణ పాయసం పోసి పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు పాయసం, జల బిందెలను నెత్తిన ఎత్తుకొని గ్రామంలో ఊరేగింపుగా రామ నామం జపిస్తూ ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు చేరుకున్నారు. ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాదాలకు అభిషేకం చేసి వరుణ పాయసం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

'దొడ్డా' జీవితం.. నేటి తరానికి ఆదర్శం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు



దొడ్డా నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రామచందర్‌రావు, తదితరులు

చిలుకూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు జీవితం నేటి తరానికి ఆదర్శమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు అన్నారు. మంగళవారం చిలుకూరులోని దొడ్డా నారాయణరావు ఇంట్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొడ్డా నారాయణరావు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దొడ్డా ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దొడ్డా కుటుంబసభ్యులు డాక్టర్ శ్రీపతిరెడ్డి, దొడ్డా సురేష్, రమేష్, శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, బీజేపీ నాయకులు కనగాల వెంకటరామయ్య, నూనె సులోచన, బొలిశెట్టి కృష్ణయ్య, అక్కిరాజు యశ్వంత్, సాతులూరి హనుమంతరావు, మేకల వెంకట్రావు, కొడారు సుదర్శన్, కొండా శ్రీను, కొడారు రాము, సతీష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ముత్యాలుగౌడ్, తదితరులు

గరిడేపల్లి : మండలంలోని సర్వారం పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన పెండెం ముత్యాలుగౌడ్ మంగళవారం మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. చైర్మన్‌గా ఎన్నిక కావడానికి సహకరించిన మంత్రికి ముత్యాలుగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకులు మంత్రితో చర్చించారు. మంత్రి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మూలగుండ్ల సీతారాంరెడ్డి, గుండు రామాంజీగౌడ్, కటికం రమేష్, పాకాల పరమేష్, బల్దూరి సందీప్, బారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆరెపూడి నారాయణ, కటికం గోపయ్య, పెండెం కోటేశ్వరరావు, దొంతగాని మట్టపల్లి పాల్గొన్నారు.

లైనింగ్ పనుల్లో నాణ్యత లోపం



లింగగిరి మేజర్ కాలువ లైనింగ్ పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణ శివారులోని లింగగిరి మేజర్ కాలువ లైనింగ్ పనులను మంగళవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కాలువ లైనింగ్ పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తోందని ఆరోపించారు. కంకర, సిమెంట్, ఇసుక సరైన పాళ్లలో వేయకపోవటంతో అనేకచోట్ల కంకర బయటకు కనిపిస్తుందని తెలిపారు. లైనింగ్‌కు సరిగా క్యూరింగ్ కూడా చేయట్లేదని దీంతో మూడు రోజులకే లైనింగ్ మొత్తం నెర్రెలు బారిందని అన్నారు. లైనింగ్ పనులు ఆలస్యంగా మొదలు పెట్టడంతో త్వరితగతిన పూర్తిచేయాలని చూస్తున్నారని, పనులు ఇలాగే కొనసాగితే కొద్దిరోజులకే లైనింగ్ పాడైపోతుందని తెలిపారు. పనులను అధికారులు పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.హుస్సేన్, వెంకటనారాయణ, వీరబాబు, మురళి, వీరయ్య, వెంకన్న, త్రివేణి, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు కొత్త పెన్షన్లు ఇవ్వాలని వినతి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగ పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచాలని, అర్హులకు కొత్త పెన్షన్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు మంగళవారం గరిడేపల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు సీపీఐ సమితి ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్య, వితంతువు పెన్షన్లు రూ.4వేలు , వికలాంగులకు రూ.6వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు ఎడ్ల అంజిరెడ్డి, పోకల ఆంజనేయులు, ప్రధాని సైదులు, కుందూరు వెంకటరెడ్డి, గోధుమల ఈశ్వరచారి, నరసింహాచారి, పందిరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరం



క్షయవ్యాధి నిర్ధారణ శిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, ప్రజలు

మునగాల : క్షయవ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ నోడల్ పర్సన్ లింగం రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని నర్సింహులగూడెంలో రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్షయవ్యాధి నిర్ధారణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో 80మందికి డిజిటల్ ఎక్స్‌రే, 25 మంది నుంచి కళ్లె సేకరించి జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపించామని, 20 మందికి మందులు అందజేసినట్లు తెలిపారు. శిబిరంలో టీబీ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ బడుగు ప్రసాద్, డీఈఓ మాధవరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీందర్, ఏఎన్ఎంలు మండవ లలిత, చిలువేరు నాగమణి గ్రామపంచాయతీ సెక్రటరీ సైదులు, ఆశావర్కర్లు మరియమ్మ, నాగమణి, ఎస్.నాగమణి, భాగ్యలక్ష్మి, డి.నాగమణి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెదజల్లె పద్ధతిలో సాగుకే రైతుల మొగ్గు



చిలుకూరులో వడ్లు వెదజల్లుతున్న రైతులు

చిలుకూరు : మండలంలో రైతులు వానాకాలం సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. అధిక శాతం మంది రైతులు కూలీల కొరతను అధిగమించేందుకు వరి నాట్లకు బదులుగా వెదజల్లె పద్ధతిలో సాగు చేస్తున్నారు. చిలుకూరు మండల కేంద్రంతో పాటు బేతవోలు, జెర్రిపోతులగూడెం, కొండాపురం, నారాయణపురం తదితర గ్రామాల్లో రైతులు ఇప్పటికే వెదజల్లె పద్ధతిలో వడ్లు చల్లుకున్నారు. దాదాపుగా 70 శాతం మందికిపైగా రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.